కాచిగూడలో
బీఎస్ఎన్ఎల్ మేళా నేడు

కాచిగూడ: బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం కాచిగూడలో ఈ నెల 16న బీఎస్ఎన్ సర్వీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ సెంట్రల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.రమణానందం తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదులు, బిల్లింగ్ ఫిర్యాదులు, కొత్త కనెక్షన్లకు సంబంధించిన సేవలు, ప్లాన్ టారిఫ్‌లపై అధికారులు మేళాలో వివరిస్తారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్
కస్టమర్ సర్వీస్ క్యాంపు

అంబర్‌పేట: బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో కస్టమర్ సర్వీస్ క్యాంపును ఈ నెల 17న చేపట్టనున్నట్లు సంస్థ డీజీఎం ఎం.నర్సింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీడీ కాలనీ ఎస్బీఐ బ్యాంక్ సమీపంలో ఉదయం 9.30 నుంచి సాయంత్ర 5.30 గంటల వరకు సర్వీస్ క్యాంపు కొనసాగుతుందన్నారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు సంస్థ అందించే సేవలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ క్యాంపులో వివరిస్తామని తెలిపారు. ఈ క్యాంపును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్
నూతన కార్యవర్గం



ఎన్నికైన హైదరాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు

చిక్కడపల్లి: హైదరాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బి.సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.నరసింహ, ఉపాధ్యక్షులుగా సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, వంశీ, రఫిక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిక్కడపల్లిలో మంగళవారం సాయంత్రం మాట్లాడుతూ బి.సుదర్శన్ రెడ్డి, కె.నరసింహలు మాట్లాడుతు హ్యాండ్ బాల్ అసోసియేషన్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తిన వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికైన అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా శివకుమార్, శ్యామ్‌రావు, రత్నాకర్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా గణేష్, రణధీర్, అఖిలారెడ్డి, మౌనిక, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

సకల కళలను
సామాన్యులకు దగ్గర చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న నృత్యగురువులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నాట్య కళలు సాంస్కృతిక వికాసానికి దోహదం చేస్తాయని టీపీఎస్కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక ఆధ్వర్యంలో మంగళవారం భారతీయ నృత్య గురువుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సామాజిక సాంస్కృతిక అంతరాలను దాటి సకల కళలను సామాన్యులకు దగ్గర చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలలో విలువలను పెంచెందుకు నాట్య కళలు దోహదపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో చినుకు కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు పీఎస్ మూర్తి, నృత్య గురువులు వరుణ్, కృష్ణ, పవన్, లావణ్య, రాధిక, రమాదేవి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగకు 6నెలల జైలు

కాచిగూడ: రైల్లో సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ఓ యువకుడికి రైల్వే కోర్టు మంగళవారం 6నెలల జైలు శిక్ష విధించిందని కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపారు. బాలాపూర్ షాహీన్‌నగర్ ప్రాంతానికి చెందిన అజాజ్ కుమారుడు మొహ్మద్ అయాన్ (22) డెకరేషన్ వర్క్ చేస్తుంటాడు. ఫలక్‌నుమా, కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య ప్రయాణికుడి సెల్ ఫోన్ దొంగతనం జరిగింది. రైల్వే ప్రయాణికుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ ఎండీ గౌస్ పాషా ముందు హాజరు పరచగా సెల్‌ఫోన్‌ల దొంగకు కోర్టు 6 నెలల జైలు శిక్ష విధించిందని తెలిపారు.

దృష్టి మళ్లించి నగదు అపహరణ

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లో దృష్టి మళ్లించి కిరాణా షాప్ యాజమానురాలి వద్ద నుంచి నగదును అపహరించిన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో పీపుల్స్ పార్క్ సమీపంలో ఉండే కిరణాషాప్ యాజమాని శ్రావణి, పిండిగిర్ని కిరణాషాప్ నడిపిస్తోంది. మంగళవారం ఒంటరిగా ఉన్న శ్రావణిని గమనించిన ఓ యువకుడు టూవీలర్‌పై వచ్చి మాటల్లో పెట్టి డబ్బులు తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎప్పుడేమైనా జరగొచ్చు..!



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన సంజయ్‌గాంధీనగర్ బస్తీ క్వార్టర్స్



ప్రాణ సంకటంగా మారిన సంజయ్‌గాంధీనగర్ క్వార్టర్స్

- కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ శిథిల భవనం
- శ్లాబ్‌ల పెచ్చులూడుతున్నా భయం గుప్పిట్లో ఉంటూ..
- వేరే ప్రాంతానికి వెళ్లలేక బిక్కుబిక్కుమంటూ ఉంటున్న వైనం
- కాపాడాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులకు వేడుకోలు

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ సంజయ్‌గాంధీ నగర్‌లో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ 1998లో క్వార్టర్స్ (జీప్లస్ 3) నిర్మించింది. 27 ఏళ్ల క్రితం స్థానిక పేదలకు ఇందులో ఫ్లాట్‌లను కేటాయించింది. అప్పటి నుంచి ఈ క్వార్టర్స్‌లో సుమారు 54 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రస్తుతం క్వార్టర్స్‌లోని చాలా ఫ్లాట్‌లు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. క్వార్టర్స్‌కు అక్కడక్కడా పగుళ్లు ఏర్పడ్డాయి. చాలా సందర్భాలలో కొన్ని ఫ్లాట్‌లలో శ్లాబ్ పెచ్చులూడి కిందపడ్డాయి. దీంతో ఇక్కడి వారు బిక్కుబిక్కుమంటూ రోజులు వెళ్లదీస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల బాల్కనీ రెయిలింగ్ కూలి ముగ్గురికి గాయాలు...

◆ క్వార్టర్స్ బాల్కనీ రెయిలింగ్ కూలి ఇటీవల ఓ వ్యక్తితో పాటు ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఎం.సంజయ్ (25) తన కూతురు ఎం.క్షేత్ర (2)తో కలిసి ఇంట్లో నుంచి పాల ప్యాకెట్ తీసుకురావడానికి బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా బాల్కనీ రెయిలింగ్ కూలి తండ్రి, కూతురు ఇద్దరు కింద పడ్డారు. రెయిలింగ్ శిథిలాలు పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడటంతో ఆ ఇంటి రేకులు ధ్వంసమయ్యాయి. ఇంట్లో పడుకుని ఉన్న చిన్నారి పి.నిత్యాసింగ్ (6నెలలు)కు గాయాలయ్యాయి.

ఇక్కడే ఇళ్లు కట్టించి ఇవ్వాలి: బస్తీ ప్రజలు

◆ బస్తీ క్వార్టర్స్ స్థానంలో కొత్త ఇళ్లు కట్టించి ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. క్వార్టర్స్‌ను కూల్చేసి కొత్తగా 54ఫ్లాట్‌లతో క్వార్టర్ కట్టించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు.

◆ **సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి: అధికారులు**

సంజయ్‌గాంధీనగర్ బస్తీని ఇటీవల హిమాయత్ నగర్ తహసీల్దార్ డి.సంధ్యారాణి, జీహెచ్ఎంసీ ఏసీపీ దేవేందర్‌తో పాటు జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సందర్శించి బస్తీవాసులతో మాట్లాడారు. బాల్కనీ రెయిలింగ్ కూలి గాయపడ్డ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. క్వార్టర్స్ ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, ఎప్పుడైనా ప్రమాదం జరగొచ్చని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. స్థానికుల నుంచి వస్తున్న



ఇటీవల కూలిన బాల్కనీ రెయిలింగ్, శ్లాబ్



విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

అండగా ఉంటామంటున్న అఖిలపక్ష పార్టీల నేతలు

కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణితో పాటు వివిధ పార్టీల నేతలు బస్తీలో పర్యటించారు. నేరుగా సమస్యను పరిశీలించి వాని డిమాండ్లను తెలుసుకున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న క్వార్టర్స్ స్థానంలో మరో భవనం నిర్మించేలా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల దృష్టి తీసుకెళ్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే తాము న్యాయం జరిగే వరకు పోరాడతామని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారమయ్యే వరకు బస్తీవాసులకు అన్ని వేళలా అండగా ఉంటామని తెలిపారు.



శ్లాబ్ కూలి ఓ ఇంటి రేకులు ధ్వంసం కావడంతో బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ డి.సంధ్యారాణి, గాయపడిన వ్యక్తి, చిన్నారులు

న్యాయం జరిగేలా చూస్తా: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఇటీవల బస్తీవాసులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని.. భయంతో బతుకుతున్నామని వారు తెలిపారు. తమకు కొత్తగా భవనాన్ని నిర్మించి ఇవ్వాలని వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన కేంద్రమంత్రి వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన బస్తీవాసులతో మాట్లాడుతూ న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.



వినతి పత్రం అందజేస్తున్న బస్తీ ప్రజలు

ముందు ప్రాణాలు కాపాడుకోండి: కార్పొరేటర్ లావణ్య



బస్తీలో పర్యటించిన అఖిల పక్ష పార్టీల నేతలు

క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయని గోల్నాక కార్పొరేటర్ లావణ్య అన్నారు. ఇక్కడ ఉండే వారు ముందుగా క్వార్టర్స్ ఖాళీ చేసి బయట ఉండటం మేలని సూచించారు. క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించడమా లేదా కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడమా అనేది అధికారులు విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు. అప్పటి వరకు ఇక్కడ ఉండే వారు ప్రమాదాలబారిన పడకుండా ఉండాలంటే కొంత కాలం బయట ఉండటం మేలన్నారు. బస్తీవాసులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని మీకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయిస్తాం: ఎమ్మెల్యే కాలేరు

ఇటీవల బస్తీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్వార్టర్స్‌లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



గొప్ప మానవతా మూర్తులు పూలే దంపతులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గొప్ప మానవతా మూర్తులు మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రి బాయిపూలే అని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, పూలే దంపతుల విగ్రహాల వ్యవస్థాపక చైర్మన్ అయిలి వెంకన్నగౌడ్, బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులుతో కలిసి ఆయన మంగళవారం జోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి మండల కేంద్రంలో పూలే దంపతుల విగ్రహాలను నెలకొల్పుతామని చెప్పారు. పూలే దంపతుల పోరాటంతోనే బలహీనవర్గాల వారికి విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నరేందర్‌గౌడ్, హరిశంకర్‌గౌడ్, రామకృష్ణ, విజయకుమార్‌గౌడ్, ఎంవీ రమణ, నారాయణగౌడ్, దుర్గయ్యగౌడ్, నగేష్, ఎర్ర శ్రీహరి, ఒంగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న వీహెచ్, బాలరాజుగౌడ్, వెంకన్నగౌడ్

దళిత శ్రామిక చైతన్యం అంబేడ్కర్ జీవిత ఆశయం



అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, జనార్ధనామూర్తి

చిక్కడపల్లి: దళితులకే కాక శ్రామికులకు కూడా చైతన్యవంతమైన జీవితం ఉండాలన్న ప్రణాళికలను రూపొందించిన మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ జీవిత ఆశయమని ఎస్వీ యూనివర్సిటీ పూర్వవీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభలో గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధనామూర్తి అధ్యక్షతన

కొలకలూరి ఇనాక్

ప్రముఖ రచయిత జయసూర్య రచించిన బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. అంబేడ్కర్ కేవలం దళితుల పక్షపాతి అని అనుకుంటారని కానీ భారతీయులలో చైతన్యం తీసుకురావడానికి ప్రజలందిరిని ప్రేమించిన వ్యక్తిగా ఆయనను గుర్తుంచుకోవాలన్నారు. 1951 సంవత్సరంలో న్యాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో స్త్రీలకు మేలు చేసే హిందూ కోడ్ బిల్లుకు తిరిగి ప్రాణం పోస్తేనే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు భవాని శ్రీనివాస్, కోళ్ల సుధాకర్, పాతశివకుమార్, వీణాపాణి తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

చిక్కడపల్లి: కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని బీజేవైఎం సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని జీహెచ్ఎంసీ ఆటస్థలంలో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు జరిగిన సర్టిఫికెట్‌లను బీఆర్ఎస్ యువజన్ విభాగం నేత ముఠా జైసింహాలతో కలసి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు సంజయ్, రఘు, మనిష్‌యాదవ్, రాకేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సహకారంతోనే పండుగలు ప్రశాంతం

ముషీరాబాద్: ప్రజల సంపూర్ణ సహకారంతోనే ఇటీవల జరిగిన రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ శోభాయాత్రలు ప్రశాంతంగా జరిగాయని జీహెచ్ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ రామానుజరెడ్డి అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డీఎంసీ, అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్ చంద్రాలను కలిసి సన్మానించారు. నెల రోజుల పాటు రంజాన్ మాసంలో 24 గంటలు పని చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నందుకు అధికారులను అభినందిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంసీ రామానుజరెడ్డి మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేశారని పేర్కొన్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించామని తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో పని చేసే జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలను సైతం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ రహీం ఉద్దీన్, చాంద్‌ఖాన్, యూసుఫ్, అబ్దుల్ లతీఫ్, మహ్మద్‌మసూద్ తదితరులు పాల్గొన్నారు.



డీఎంసీ రామానుజరెడ్డిని సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ తదితరులు

ఆర్థిక ఇబ్బందులు తాళలేక
వ్యక్తి ఆత్మహత్య

చిక్కడపల్లి: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పద్మకాలనీ పీవీఆర్ ఎస్టేట్ ప్లాట్ నంబర్ 101లో పరుశురాం(45) భార్య, అద్దరు కూతుర్లతో కలసి నివాసం ఉంటున్నారు. గతంలో ప్రైవేట్ జాబ్ చేసేవాడు. గత రెండున్నర ఏళ్లుగా రాపిడోలో ద్విచక్ర వాహనం నడుపుతున్నారు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పరుశురాం చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం స్కూల్ నుంచి తిరిగి వచ్చిన కూతురు పరుశురాం ఇంతకి తలుపు తీయకపోవడంతో, తల్లికి సమాచారం అందిచారు. వెంటనే ఇంటికి చేరుకున్న భార్య తన బంధువుల సహాయంతో డోర్ బద్దలు కొట్టి చూడగా పరసురాం ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆర్థిక సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. కేసును ఎస్ఐ అభిలాష్ దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళం బద్దలు కొట్టి చోరీ

చిక్కడపల్లి: ఇంటితాళం బద్దలు కొట్టి చోరీకి పాల్పడిన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన శశికుమార్ బాగ్‌లింగంపల్లిలోని ఎంఐజీ–2 ప్లాట్ నంబర్ 9లో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం యథావిధిగా తన ఆఫీస్‌కి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం తిరిగి ఆఫీస్‌కు వచ్చిన శశికుమార్ తాళాలు బద్దలు కొట్టి డోర్ తెరిచి ఉండటం గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఒక ల్యాప్‌టాప్, గ్యాస్ సిలిండర్, మూడు సిల్వర్ కాయిన్‌లను చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కళా వికాసంలో సాంస్కృతిక సంస్థల కృషి ఎనలేనిది



స్వర్ణనంది పురస్కార గ్రహీతలతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, చక్రపాణి, ఏలేశ్వరపు చలపతిశాస్త్రి

చిక్కడపల్లి: ప్రతిభను గుర్తించి గౌరవించడం సత్సంప్రదాయమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మంగళవారం శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో జరిగిన నాట్య వసంతోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాంస్కృతిక సంస్థలు కళా వికాసానికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు ఉగాది స్వర్ణనంది పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.చక్రపాణి, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ నేషనల్ అడ్వైజర్ డాక్టర్ కొమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, సంప్రదాయ కూచిపూడి నాట్యగురువు ఏలేశ్వరపు చలపతి శాస్త్రి, కథక్ కళాక్షేత్ర డైరెక్టర్ పండిట్ డాక్టర్ అంజిబాబు, రచయిత్రి ముక్తేవి భారతి, అంజనీకుమారి, సాహితీ విధూషిమణి, రమాదేవి బుక్కపట్నం, కళ్యాణి, గొల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 100గజాల స్థలం ఇవ్వాలి

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నివసించే ఇళ్లులేని పేదలకు 100 గజాల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈనెల 26న ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ భవన్‌లో జరిగిన ఇల్లు లేని గుడిసె వాసుల సంఘం సమావేశంలో నీలం వెంకటేష్, భాకీ రవిల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో గతంలో కాచవాని సింగారం, తట్టిఅన్నారం, ఆర్కే నగర్ ఇళ్ల పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం 'స్థలాలు కేటాయించకుండా.. పొజిషన్ ఇవ్వకుండా..'4వేల మందికి మొండి చేయి చూపిందన్నారు. వీరికి వెంటనే స్థలాలు చూపించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కుంట్లూరులో కూడా పేదలు గుడిసెలు వేసుకున్న వారికి ఇల్లు పట్టాలు ఇవ్వడం లేదన్నారు.

గ్రేటర్‌లో ఇళ్లు లేని పేదలు 6లక్షలు ఉన్నారు..

గ్రేటర్ పరిధిలో ఇళ్లులేని పేదలు 6లక్షల వరకు ఉన్నారని రాజీవ్ స్వగృహ, డబుల్ బెడ్‌రూమ్ నిర్మించినప్పటికీ వారికి వాటిని పూర్తిస్థాయిలో కేటాయించడం లేదన్నారు. కేటాయింపుల్లో అనేక అవకతవకలు జరిగాయని అన్నారు. నిజమైన పేదవారికి ఇల్లు దక్కలేదన్నారు. ఈ స్కీమ్ పూర్తి విజయవంతం కాలేదని పేర్కొన్నారు. చాలా మందికి ఇళ్లు లేవని ఇళ్ల స్థలాలు లేవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్టే గ్రేటర్ హైదరాబాద్‌లో పేదలకు స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాపల్లి అంజి, బీఎస్ రమేష్, కోశాల్, మణికంఠ, పగిళ్ల సతీష్, రాందేవ్, నవీన్, నాగరాజు, చిరంజీవి, ఉపేందర్, సామయ్య, వెంకన్న, అయ్యన్న, బాలు, కృష్ణ పాల్గొన్నారు.



ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడతాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థి వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలను ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాలు మారినా పాలకుల బుద్ధి మారటం లేదని విమర్శించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా 43వ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగంపై ఏ ప్రభుత్వం వచ్చిన సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని విమర్శించారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు.

ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ నూతన కమిటీ ఎన్నిక..

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని 43వ మహాసభలో 27 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా లెనిన్, అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా స్టాలిన్, రమ్య, నాగేందర్, శ్రీమన్, సహాయ కార్యదర్శిగా విఘ్నేష్, రజినీకాంత్, సహాన ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తదితరులు హాజరయ్యారు.



ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న కార్యదర్శి అశోక్ రెడ్డి